ప్రజాశక్తి
గురువారం 11 మే 2023
5
అనంతపురం



ఉక్కపోత..!

◆ జిల్లాలో మళ్లీ పెరిగిన ఉష్ణోగ్రతలు
◆ ఎండతక్కువే అయినా ఉక్కపోతలు
◆ ఫ్యాన్ లేకుంటే ఇంట్లో ఉండలేని పరిస్థితి

గత మూడు రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల వర్షం కురిసింది. అంతుకుమును భానుడిభగభగలతో సతమతం అయిన ప్రజలకు ఈ వర్షాలు కాస్త ఉపశమనాన్ని ఇచ్చాయి. ఐదు రోజులు పాటు ఎండ అనేది లేకుండా ఉంది. రోజుల వ్యవధిలోనే పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. వెళ్లిపోయిందనుకున్న ఎండలు మళ్లీ వచ్చాయి. బుధవారం నాడు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. కొన్ని ప్రాంతాల్లో 38, 39 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరాయి. ఉక్కపోతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫ్యాన్ ఉంటే తప్పా ఇంట్లో ఉండలేని పరిస్థితి నెలకొంది.



ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సూరీడు మళ్లీ సుర్రుమనిపిస్తున్నాడు. ఉదయం 9 గంటల నుంచే వేడిగాలులు వీస్తున్నాయి. ఇంట్లో తీవ్రమైన ఉక్కపోతలు నెలకొన్నాయి. పట్టణ ప్రాంతాల్లో మధ్యాహ్న సమయంలో రోడ్లన్నీ ఖాళీగా కన్పిస్తున్నాయి. బుధవారం నాడు అనంతపురంలో 32 డిగ్రీలు నమోదు అయ్యింది. ఎండవేడిమి కన్పించకున్నా మరో వారం రోజుల పాటు ఉక్కపోతలు ఇలానే ఉండే పరిస్థితి ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. నాలుగు రోజులు క్రితం వర్షం ప్రభావంతో ఎండలు కాస్త తగ్గాయి. దీంతో జనం కాస్త ఊరిపీల్చుకున్నారు. మళ్లీ వేడిగాలులు, ఉక్కపోతలు పెరగడంతో జనజీనవం ఇబ్బందిగా మారింది. సాధారణ ప్రజలతో పాటు వీధి వ్యాపారులు, పనులకు వెళ్లే కార్మికులు, వ్యవసాయ కూలీలు ఎండతీవ్రతకు పని ప్రాంతాల్లో ఉండలేని పరిస్థితి కన్పిస్తోంది. చిన్నారులు వృద్ధులు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. రాత్రి వేళ కూడా ఉక్కపోతలతో ఇంట్లో ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి. కరెంట్‌లేకపోతే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. అక్కడకక్కడ కొన్ని ప్రాంతాల్లో మేఘామృతం అయి ఉన్నా ఉక్కపోతలు మాత్రం తగ్గలేదు.

మరో కొన్ని రోజులు ఇదే పరిస్థితి...

ఉక్కపోతలు మరో ఐదు రోజుల పాటు ఇలాగే ఉంటుందని వాతవరణ నిపుణులు తెలియజేస్తున్నారు. వడగాల్పులు, ఉక్కపోతలు తీవ్రత ఎక్కువగా ఉన్నందన జనం జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో బయటకు రాకపోవడం మంచిదని సూచిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగపోవడమే మంచిదని చెబుతున్నారు. ఉక్కపోతల నుంచి ఉపశమనం పొందేందుకు చల్లిటి ప్రాంతాల్లో ఉండాలని సూచిస్తున్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు

జవాబుదారీతనాన్ని పెంచేలా 'జగనన్నకు చెబుదాం'

◆ 1902 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ
◆ కలెక్టర్ ఎమ్.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అధికారుల్లో జవాబుదారీతనాన్ని మరింత మెరుగుపరచి, అర్జీదారులకు వేగవంతమైన, నాణ్యమైన పరిష్కారంకోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని కలెక్టర్ ఎమ్.గౌతమి పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్సు హాలులో జిల్లాలో "జగనన్నకు చెబుదాం" కార్యక్రమంపై ఎస్పీ కె.శ్రీనివాస రావు, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌లతో కలిసి కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. స్పందన కార్యక్రమాన్ని మరింత మెరుగ్గా చేయాలనే ఉద్దేశంతో నేరుగా ముఖ్యమంత్రికే చెబుదాం అనే ఆలోచనతో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. ఇప్పటి వరకు అనంతపురం జిల్లాలో స్పందన కార్యక్రమంలో 26,639 అర్జీలు నమోదవగా 26,160 అర్జీలకు (98.20 శాతం) పరిష్కారం చూపామన్నారు. వివిధ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయిలో ఎదురయ్యే సమస్యలకు మరింత మెరుగైన, నాణ్యమైన పరిష్కారాలను చూపాలన్నారు. స్థానిక అధికారులు సత్ఫలితాన్ని ఇవ్వని పరిస్థితుల్లో ఇక నేరుగా జగనన్నకు చెబుదాం టోల్ ఫ్రీ నంబరు 1902కి ఫోన్ చేయవచ్చు అన్నారు. ఈ సమస్యలకు ముఖ్యమంత్రి స్థాయిలో పరిష్కారం చూపే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంపై రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. ఇందుకోసం జిల్లా ప్రత్యేక అధికారిగా ఉద్యాన శాఖ కమిషనర్ ఎస్ఎస్.శ్రీధర్‌ను నియమించారని చెప్పారు. జిల్లాస్థాయిలో డిస్టిక్ ఆడిట్ టీమ్‌లో పీఏబీఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, జడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డిలను నియమించామన్నారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యలపై అర్జీదారుడు వందశాతం సంతప్తి చెందేలా వారికి అధికారులు సహకరించాలన్నారు. ఇందుకు సంబంధించి పోలీస్ శాఖలో స్టేషన్‌స్థాయి నుంచి సబ్ డివిజన్ జిల్లా స్థాయిల వరకు అందరినీ చైతన్యపరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏబీఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, జడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, స్పందన తహశీల్దార్ వాణిశ్రీ పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం



ఫలితాలను విడుదల చేస్తున్న విసి రంగజనార్ధన

జెఎన్‌టియు పరిధిలో బీటెక్ ఫలితాలను జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన బుధవారం సాయంత్రం విడుదల చేశారు. బీటెక్ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్-19) రెగ్యులర్, (ఆర్-15) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ బీటెక్ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్-19) రెగ్యులర్ పరీక్షలకు 14,508 మంది హాజరవ్వగా 13,137 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 90.55 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని చెప్పారు. ఇందులో బాలురు 7,888 మంది హాజరవ్వగా 6,836, విద్యార్థినులు 6,620 మంది హాజరవ్వగా, 6,301 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పరీక్ష ఫలితాలకు సంబంధిత రీకౌంటింగ్ ఫొటో కాపీ, ఛాలెంజ్ వాల్యూయేషన్‌కు నోటిఫికేషన్ జారీ చేస్తున్నామని చెప్పారు. గురువారం నుంచి వీటిని దరఖాస్తుచేసు కోవచ్చునని తెలిపారు. బీటెక్ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్-19) పరీక్షకు సంబంధించిన అడ్వాన్స్ సప్లిమెంటరీ నోటిఫికేషన్‌ను జారీ చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంబిఎ మూడవ సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్, (ఆర్-17) పరీక్షా పలితాలను విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయ కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, వర్సిటీ అకడమిక్ డైరెక్టర్ వి.సుమలత, పరీక్షలు విభాగం డైరెక్టర్ ఇ.కేశవ రెడ్డి, కంట్రోలర్ బి.చంద్రమోహన్ రెడ్డి , అడిషినల్ కంట్రోలర్స్ డాక్టర్ యం.రామ శేఖరరెడ్డి, కె.జయలక్ష్మి , డాక్టర్ జితేంద్ర గౌడ్, డాక్టర్ శ్రీధర్, డిప్యూటి రిజిస్ట్రార్లు యన్.మధుసూధన రెడ్డి, ఎస్.రంగా నాయక్ పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన సబ్సిడీ విత్తనాలు

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్



ప్రాసెసింగ్ అనంతరం వేరుశనగ విత్తన నాణ్యతను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్


ప్రజాశక్తి-అనంతపురం

ఖరీఫ్‌కు సంబంధించి సబ్సిడీ వేరుశనగ విత్తనాలను అన్ని ప్రమాణాలూ పాటించి, నాణ్యమైనవి అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురం నగరంలోని విజయ ఆగ్రోసీడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.చంద్రనాయక్, జిల్లా ఏపీసీడ్స్ మేనేజర్ ధనలక్ష్మితో కలిసి జాయింట్ కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. విజయ ఆగ్రో సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్‌లో సబ్సీడీ వేరుశనగ ప్రాసెసింగ్ చేస్తున్న విధానం, వేరుశనగ షెల్లింగ్, తేమ శాతం, ఫిజికల్ ప్యూరిటీ తదితర ప్రమాణాలను పరిశీలించారు. సబ్సిడీ వేరుశనగ బస్తాను తూకం వేసి పరిశీలించారు. 30.300 కిలోలు రావడంతో సంతప్తి వ్యక్తం చేశారు. విత్తన పంపిణీ సమయం ఆసన్న మవుతున్న తరుణంలో ప్రతిరోజూ ఎక్కువ మంది కూలీను ఏర్పాటు చేసుకుని వేరుశనగ ప్రాసెసింగ్ వేగవంతం చేయాలని సూచించారు. ప్రాసెసింగ్ అయిన విత్తనాలను రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేయాలని ఎపి.సీడ్స్ అధికారులను ఆదేశించారు. నాణ్యమైన విత్తనాన్ని మాత్రమే ఆర్‌బికెలకు సరఫరా చేయాలని ఆదేశించారు. నాణ్యతలో ఏ విధమైన రాజీ పడకుండా ప్రాసెసింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర ప్రసాద్, ప్రాసెసింగ్ యూనిట్ ఇన్‌ఛార్జి సాయిలక్ష్మి ప్రాసెసింగ్ యూనిట్ యజమాని భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌కు విద్యార్థుల అధిక సంఖ్యలో హాజరవుతుండటంతో విశేష స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా ఆయా మండల శాఖ గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపులకు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా హాజరవుతున్నారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన మూడవ రోజు సమ్మర్ క్యాంప్‌ను మాజీ వ్యవసాయ శాఖ సలహాదారు అంబటి కృష్ణారెడ్డి దంపతులు హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉచిత వేసవి శిక్షణా శిబిరానికి విద్యార్థులు హాజరై ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. వేసవి దృశ్య పిల్లలకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు యోగా, 9 నుంచి 10 గంటల వరకు కథలు చెప్పడం, 10 నిమిషాలు విరామం. 10:10 నుంచి 11 గంటల వరకు డ్రాయింగ్, 11 నుంచి 12 గంటల వరకు పుస్తక సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. 70 మంది విద్యార్థులు శిక్షణలో హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారిని వి.సుబ్బరత్నమ్మ, గ్రంథాలయ సిబ్బంది ఇంతియాజ్, కావేరి, హేమమాలిని, మల్లికార్జున, ఉజ్జినేశ్వరి, విద్యార్థులు, వారి తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



రేషన్ షాపు వద్ద పిల్లలను ఎత్తుకొని ఇబ్బందులు పడుతున్న మహిళలు, వృద్ధులు



ఓ ఇంటి దగ్గర వృథాగా నిలిపిన ఎండిఎం వాహనం

ప్రభుత్వ ఆశయానికి తూట్లు

పత్తాలేని ఎండిఎం వాహనాలు
మామూళ్ల మత్తులో రెవెన్యూ యంత్రాంగం
డీలర్ల వద్దనే రేషన్ పంపిణీ

ప్రజాశక్తి-కుందుర్పి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటి వద్దకే రేషన్ పంపిణీ' కార్యక్రమానికి కుందుర్పి మండలంలో తిలోదకాలు ఇచ్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రేషన్‌కార్డుదారులకు ఇంటి వద్దకే బియ్యం, ఇతర నిత్యావసరాలు అందించాలన్న ఉద్దేశ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఎండిఎం వాహనాలు కొనుగోలు చేసింది. అలాగే ఆపరేటర్లతో పాటు సహాయకుడిని నియమించి వారికి ఎండిఎం వాహనాలను అప్పజెప్పింది. అయితే కుందుర్పి మండలంలో ఎండిఎం ఆపరేటర్లు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ ఆశయాన్ని నీరుగారుస్తున్నారని అధికార పార్టీ నాయకులే విమర్శిస్తుండడం గమనార్హం. మండల వ్యాప్తంగా 40 చౌక దుకాణాలు, 10 వాహనాలు ఉండగా, ఎక్కువ శాతం ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల చేతుల్లో ఉన్నాయి. దీంతో మమ్మల్ని ఎవరూ ఏమీ చేసుకోలేరన్న ధీమాలో ఉన్నారు. మండల వ్యాప్తంగా రేషన్ డీలర్లు తమ ఇంటి వద్దే బియ్యం, ఇతర నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు. దీంతో రేషన్‌కార్డుదారులు బారులు తీరి గంటల తరబడి వరుసలో వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పర్యవేక్షించాల్సిన రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ అధికారులకు కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు లక్షలాది రూపాయలు ముడుపులు అందిస్తున్నామని తమను ప్రశ్నించే వారు లేరని ఆపరేటర్లు బహిరంగంగా పేర్కొంటున్నారు. వేలాది రూపాయల జీతాలు తీసుకొంటూ ప్రజలకు న్యాయం చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఎండిఎం ఆపరేటర్లు ప్రభుత్వ ఆశయాన్ని నీరుగారుస్తున్నారని అధికార పార్టీ నాయకులే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా యంత్రాంగం రెవెన్యూ అధికారులు, ఎండిఎం ఆపరేటర్లపై చర్యలు చేపట్టాలని రేషన్‌కార్డుదారులు కోరుతున్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయ భవనం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల కేంద్రమైన బొమ్మనహాల్‌లోని ప్రభుత్వ గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకొంది. దీంతో పాఠకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల 50 గ్రామాలకు ఒకే ఒక్క గ్రంథాలయం ఉంది. ఈ గ్రంథాలయానికి రోజూ వంద మందికి పైగా పాఠకులు వివిధ పుస్తకాలు, దినపత్రికలు చదవడానికి వస్తుంటారు. అయితే వరండా, భవనం లోపల పలుమార్లు పెచ్చులూడి పడ్డాయని పాఠకులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఏ క్షణంలో కూలుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు విద్యార్థుల కోసం ప్రభుత్వం గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తోంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రంథాలయ భవనానికి మరమ్మతులు చేయడం లేదా నూతన భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పాఠకులు శంకరయ్య, ఓబులేసు, అన్నమయ్య, గోవిందప్ప, ప్రహ్లాద, తదితరులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న బొమ్మనహాల్ గ్రంథాలయ భవనం

రెవెన్యూ అధికారుల సమన్వయ లోపం.. ప్రజలకు కష్టం..!

ప్రజాశక్తి-బొమ్మనహాల్

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారుల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారిందని చెప్పవచ్చు. ముఖ్యంగా తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ల మధ్య సమన్వయం కొరవడిందని కార్యాలయ సిబ్బందే బహిరంగంగా మాట్లాడుకోవడం గమనార్హం. దీంతో ఆర్ఐ, వీఆర్వోలు ప్రజల ఎలాంటి రెవెన్యూ పనులు చేయలేక నిస్సహాయ స్థితిలో ఉంటున్నారు. నూతన పట్టాదారు పాసు పుస్తకాలు, పాత వాటిలో మార్పులు, చేర్పులు, ఇంటి పట్టాలు, వంశ వక్షం, తదితర పనులు కాక రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. పంట రుణాల రెన్యువల్ సమయంలో తమ బాధలు ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రభుత్వ భూములు, ఇంటి స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వీఆర్వోలు ఆర్ఐపైన, ఆయన డిప్యూటీ తహశీల్దార్‌పైన, ఆయన తహశీల్దార్‌పైన చెబుతూ కాలయాపన చేస్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు

సచివాలయ వ్యవస్థతో

బాల్యవివాహాలకు అడ్డుకట్ట

మహిళా పోలీసులతో మహాసైన్యం ఏర్పాటు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న గౌతమి

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయడానికి గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ఎంతో దోహదం చేస్తోందని కలెక్టర్ ఎమ్.గౌతమి పేర్కొన్నారు. బుధవారం ఉదయం అనంతపురం ఎకాలజీ సెంటర్‌లో జిల్లా కౌమార బాలబాలికల సాధికార, బాల్య వివాహాల నిర్మూలన కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ అంగన్ వాడీలు, మహిళా పోలీసులు సమన్వయంతో పని చేస్తే బాల్య వివాహాలను సమర్థవంతంగా అడ్డుకోవచ్చన్నారు. ఆడపిల్లలకు పెళ్లి చేయడం అన్ని సమస్యలకు పరిష్కారం అనే ఆలోచన విధానంలో మార్పు తీసుకువచ్చేందుకు అన్ని శాఖలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, యూనెసెఫ్ జాతీయ ప్రోగ్రామ్ ఆఫీసర్ మురళీకష్ణ, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, యూనిసెఫ్ ప్రతినిధులు, సీడీపీవోలు, ఏసీడీపీవోలు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

104 ఉద్యోగుల ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్, సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చేపట్టిన నిరసనలు బుధవారం నాల్గవ రోజుకు చేరుకున్నాయి. యూనియన్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా ఫ్యామిలీ ఫిజిషియన్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాతను కలిసి వినతిపత్రం అందజేశారు. 104 ఉద్యోగుల పెండింగ్‌లోని రెండు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. 104ను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలన్నారు. ట్రావెలింగ్ అలవెన్స్ ఇవ్వాలని, బదిలీల సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల యూనియన్ జిల్లా నాయకులు తిప్పేరుద్ర, డీకే మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో మెరిసిన గిరిజన విద్యార్థిని

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పదవ తరగతి పరీక్షా ఫలితాలు గిరిజన విద్యార్థిని కొడావత్ తన్మయి 556 మార్కులు సాధించింది. తండ్రి కొడావత్ రమణా నాయక్ ప్రయివేట్ ఉద్యోగి. అనంతపురం నారాయణ స్కూల్‌లో చదివిన తన్మయి చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ మంచి మార్కులు సాధించింది. పెద్దయ్యాక ఇంజినీర్, శాస్త్రవేత్త కావాలనే లక్ష్యంతో చదువుతున్నట్లు తన్మయి తెలిపింది. గిరిజన కుటుంబానికి చెందిన విద్యా కుసుమం బాగా చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు.



తన్మయి



పేదలకు అన్నదానం చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

నిత్య సురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద పేదలకు ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్. ఎస్.నిర్మలమురళి అన్నదానం చేశారు. టుంకూరుకు చెందిన ఎన్ఎస్.శ్రేయాస్, ఎన్.ఎస్. వైష్ణవి దంపతుల కుమారుడు ఎన్.ఎస్. శౌర్య పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పేదలకు అన్నదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, కిష్టప్ప, ఓబుళపతి, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సునీల్‌కుమార్‌కు డాక్టరేట్


ప్రజాశక్తి-అనంతపురం



నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల మైక్రో బయాలజీ డిపార్ట్‌మెంట్‌లో ట్యూటంగా విధులు నిర్వర్తిస్తున్న ఏ.సునీల్ కుమార్ చెన్నైలోని సవిత యూనివర్సిటీ నుంచి మెడికల్ మైక్రోబయాలజీ విభాగంలో పి.హెచ్.డి డాక్టరేట్ పొందారు. ఈయన సవిత డెంటల్ కాలేజీలోని మైక్రో బయాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ స్మైలీన్ గిరిజ ఆధ్వర్యంలో పిహెచ్‌డి డాక్టరేట్ పొందారు. 'ఫీనో టైపిక్ అండ్ జీనో టైపిక్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ మితిసిలిన్ రెసిస్టెంట్ అండ్ బయోఫిల్మ్ ప్రొడ్యూసింగ్ కోయాగులేజ్ నెగిటివ్ స్టాపైలో కోక్కై ఫ్రమ్ క్లినికల్ స్పెసిమెన్స్ విత్ స్పెషల్ ఎంఫసైజ్ ఆన్ ద యాంటీ మైక్రోబియల్ ఎఫెక్ట్ ఆఫ్ ఇల్లుసీఎం వెరుమ్ బై ఇన్ విట్రో అండ్ సిలికో అనాలిసిస్' టాపిక్‌పై డాక్టర్ సునీల్ కుమార్ పరిశోధనలు చేశారు.

హేమారెడ్డి మల్లమ్మకు నివాళి

రాయదుర్గం: హేమారెడ్డి మల్లమ్మ జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలో ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కాపు రామచంద్రారెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, రాయదుర్గం రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌని ఉపేంద్ర రెడ్డి, నియోజకవర్గ రెడ్డి సామాజిక వర్గం ప్రజలు పాల్గొన్నారు.



మల్లమ్మ జయంతి సభలో పాల్గొన్న కాపు

రైతుల గురించి మాట్లాడే

అర్హత టిడిపికి లేదు

జడ్పీటీసీ నీలం భాస్కర్


ప్రజాశక్తి-బుక్కరాసముద్రం

రైతుల గురించి మాట్లాడే నైతిక అర్హత తెలుగుదేశం పార్టీ నాయకులకు లేదని జడ్పీటీసీ నీలం భాస్కర్ పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా అధికారం పోయిన తర్వాత మరొకలా ప్రవర్తించడం టిడిపి రాజకీయ నైతికకు నిదర్శనమన్నారు. 2014-19 సమయంలో రైతులను మోసం చేసిన చంద్రబాబు ఇప్పుడు రాజకీయ ఉనికి కోసం రైతుల ముసుగు వేసుకున్నంత మాత్రాన ప్రజలు నమ్మరని తెలిపారు. జగన్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించటంతో పాటు ఎరువులు, పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో రైతు భరోసా కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయన్నారు. ఈ సీజన్లో అకాల వర్షాల వల్ల బుక్కరాయసముద్రం మండలంలో 300 పైన హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లడంతో అధికారుల నివేదిక ప్రకారం రూ. 69 లక్షలను బాధిత రైతుల ఖాతాల్లో జమ చేయడానికి ఆన్‌లైన్ చేసి ఉంచారన్నారు. గత సీజన్లో పంటలు నష్టపోయిన రైతులకు రూ. 39 లక్షలను బాధిత రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు.

ఫుట్‌బాల్‌లో విద్యార్థిని ఉత్తమ ప్రతిభ

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాల విద్యార్థిని సి.మౌనిక ఫుట్‌బాల్ క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. తిరుపతిలో జరిగిన ఏపీ సీఎం కప్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో మౌనిక జట్టు రన్నర్స్‌గా నిలిచింది. అత్యుత్తమ ప్రతిభ చూపిన మౌనికను బుధవారం ప్రిన్సిపల్ డాక్టర్ సి.వెంకటేశ్వర రెడ్డి, పిఆర్ఆర్ ఎంబిఏ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసన్నకుమార్, పిఈటి రవికుమార్, అధ్యాపకులు మల్లికార్జున, యాగంటి, విశాల అభినందించారు. అలాగే పాఠశాల యాజమాన్యం నగదు బహుమతి అందజేసింది.



మౌనికను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

రైతులకు రుణాల రెన్యువల్ తిప్పలు..

ప్రజాశక్తి-బొమ్మనహాల్



పంట రుణాలు రెన్యువల్ చేసేందుకు బ్యాంకు వద్ద వేచి ఉన్న రైతులు

రైతులకు ఏటా పంట రుణాల రెన్యువల్ తిప్పలు తప్పడం లేదు. మండలంలో 70 వేల మంది రైతులు వివిధ బ్యాంకులతో పాటు కో ఆపరేటివ్ సొసైటీల్లో వ్యవసాయ రుణాలు పొందారు. ఆయా రుణాలను 11 నెలల లోపు రెన్యువల్ చేస్తేనే పావలా వడ్డీ వర్తిస్తుందని పేర్కొంటుండడం, మరోవైపు అసలు, వడ్డీ మొత్తం చెల్లించాలని బ్యాంకు అధికారులు పేర్కొంటుండడంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రూ. 1 అక్షకు 10 రోజులకు రూ. 1000 వడ్డీ చెల్లించి అప్పులు చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. అన్నీ సిద్ధం చేసుకొని రుణాలను రెన్యువల్ చేసుకోవడానికి బ్యాంకులకు వెళ్తే అక్కడ గంటల తరబడి వేచి ఉండక తప్పడం లేదు. కొన్ని బ్యాంకుల్లో గతేడాది తీసుకున్న అప్పులకు పంట నష్టపరిహారం సొమ్మును బ్యాంకులు జమ చేసుకున్నాయని రైతులు వాపోతున్నారు. వడ్డీ మాత్రమే కట్టించుకొని పంట రుణాలు రెన్యువల్ చేయాలని, గతంలో ఇచ్చిన రుణాన్ని కొంతమేర పెంచాలని ఆదేశాలు ఉన్నా బ్యాంకు అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్డీ వ్యాపారులు, బ్యాంకు మేనేజర్లు కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజా, రైతు సంఘాలు పేర్కొంటున్నాయి.

హజ్‌యాత్ర ఎంతో పవిత్రం

నగర మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

హజ్ యాత్ర అత్యంత పవిత్రమైందని నగర మేయర్ మహమ్మద్ వసీం సలీం పేర్కొన్నారు. ఏపీ హజ్ కమిటీ ప్రతినిధి ముస్తాక్ మౌలానా ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఆజాద్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన హజ్ యాత్రికుల శిక్షణ శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. ముస్లింల జీవితంలో హజ్ పాత్ర చాలా కీలకమని, ముస్లింలు పాటించే ఐదు ప్రధాన సూత్రాల్లో హజ్‌ను తప్పనిసరిగా పాటించాలని అల్లాహ్ ఆజ్ఞ ఉందని తెలిపారు. హజ్ యాత్రలో పాటించాల్సిన అనేక సూత్రాలపై మౌలానాలు చెప్పిన వాటిని తూ.చ తప్పక పాటించాలన్నారు. ముస్లింల అత్యంత పవిత్ర ప్రదేశమైన కాబాను, మక్కాను దర్శించడమే హజ్ ఉద్దేశ్యమన్నారు. హజ్‌ను నియమ, నిష్ఠలతో పాటించడం ద్వారా పవిత్రులుగా మారతారని తెలిపారు. అల్లా కోరుకున్న వారికి మాత్రమే హజ్ యాత్రకు అవకాశం లభిస్తుందన్నారు. ధనవంతులైనప్పటికీ అల్లా కప లేకపోతే హజ్ యాత్ర లభించదని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, జిల్లా బోర్డు ఛైర్మన్ రిజ్వాన్, మౌలానా అబ్దుల్ రసూల్, మౌలానా రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసిలోనే పాలసీదారుల సొమ్ముకు భద్రత

జోనల్ ఏజెంట్ల సంఘం అధ్యక్షులు జంపాల కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జంపాల కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రభుత్వ రంగ సంస్థ భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)లో మాత్రమే పాలసీ దారుల సొమ్ముకు భద్రత, భరోసా ఉంటుందని అఖిల భారత జీవిత బీమా ఏజెంట్ సమాఖ్య సంఘం జోనల్ అధ్యక్షుడు జంపాల కృష్ణారెడ్డి తెలిపా రు. గత వారం ఢిల్లీలో జరిగిన సంస్థ ఏజెంట్స్ యూనియన్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ, ఏపి, కర్నాటక రాష్ట్రాలకు సంబంధించి జోన్ అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఆయన బుధవారం రాయదుర్గం బ్రాంచ్ ఏజెంట్స్ సంఘం లీడర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని పది ఆర్థిక రంగ సంస్థల్లో ఎల్ఐసి మూడో స్థానంలో ఉందన్నారు. ఏజెంట్లు పాలసీదారులకు అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో ఎల్ఐసిది సింహ భాగమని, ఇలాంటి సంస్థపై కేంద్ర ప్రభుత్వం నియంత లా వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా లియాఫీ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, కడప డివిజన్ లియాఫీ అధ్యక్షుడు జయ భారత రెడ్డి, కార్యదర్శి కదిరప్ప, ట్రెజరర్ కృష్ణ, రాయదుర్గం బ్రాంచ్ ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు ఎం.రామాంజనేయులు, గౌరవాధ్యక్షుడు మఠం తిప్పేస్వామి, కార్యదర్శి ఈడిగ వెంకటేశులు, ట్రెజరర్ బ్రహ్మానంద, రామచంద్రరావు మల్లారెడ్డి, సి.మల్లికార్జున, సి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలు పెంచి రెన్యువల్ చేయాలి

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతుల పంట రుణాలు పెంచి రెన్యువల్ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని తరిమెల గ్రామంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో అనంత గ్రామీణ బ్యాంక్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డితో పాటు సంఘం అధ్యక్షుడు నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ మాట్లాడారు. ఖరీఫ్‌లో పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడులు కూడా దక్కకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. కావున అసలు, వడ్డీ కట్టించుకోకుండా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు పెంచి రెన్యువల్ చేయాలని కోరారు. రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని ఆందోళన చేయగా పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ ఇచ్చి రైతులను ఆదుకుంటామ ని ప్రకటించిన ప్రభుత్వం నేటికీ ఇన్సూరెన్స్ ప్రకటించ లేదన్నారు. మార్ట్ గేజ్ లేకుండా రూ. 5 లక్షల వరకు రుణాలివ్వాలన్నారు. ధర్నాలో ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, గంప మల్లయ్య, సూర్యప్రకాష్, గిరి, మేకల పెద్దన్న, కొండారెడ్డి, ఆంజనేయులు, జయరాముడు, శ్రీనివాసులు, ఆవుల రామాంజనేయులు, సుంకన్న, వరలక్ష్మి, నాగరాజు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



అనంత గ్రామీణ బ్యాంక్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత, తదితరులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

సీఎం జగన్ నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 6వ డివిజన్లో బుధవారం ఆయన కార్పొరేటర్ సుజాతతో కలిసి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక బుక్‌లెట్లను ప్రతి ఇంటికీ అందజేశారు. అలాగే స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ వసీం సలీమ్, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్ బేగ్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఫయాజ్, వైస్ ఛైర్మన్ ఓబిరెడ్డి, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సైపుల్లా బేగ్, కొర్రపాడు హుసేన్‌పీర, మదన్ మోహన్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆలుమూరు శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ కన్వీనర్ యోగి, పలువురు కార్పొరేటర్లు, వైసీపీ ముఖ్య నాయకులు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బేలోడు గ్రామాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

మండల పరిధిలోని బేలోడు గ్రామంలో కలుషిత నీరు తాగి పలువురు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన నేపథ్యంలో బుధవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ వీరబ్బాయి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మూడు రోజులు వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ వేయిస్తున్నట్లు తెలిపారు. రోగాల పట్ల ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తారని తెలిపారు. అనంతరం ఆయన రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆయన వెంట డాక్టర్లు రమేష్, బాలాజీ నాయక్, సిహెచ్ఓ మురళీధర్, సూపర్‌వైజర్ రవికుమార్, గ్రామ సర్పంచి ఉమేష్ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.



బేలోడు గ్రామంలో పర్యటిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వీరబ్బాయి

ఎస్పీని కలిసిన ఏడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి-అనంతపురం

ఏడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్ ఎం.లిఖిత బుధవారం అనంతపురం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఏడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎస్పీకి వివరించారు. ఆమెతో పాటు బ్యాంకు మాజీ ఛైర్ పర్సన్ పామిడి వీరాంజనేయులు ఉన్నారు.



ఎస్పీ శ్రీనివాసరావుని కలిసిన ఏడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్ ఎం.లిఖిత

పాడిరైతులకు వరం 'సెమెన్'

ప్రజాశక్తి-గార్లదిన్నె

ఆవులకు ఎద సమయంలో సెమెన్ ఇంజక్షన్ వేయడం వల్ల 90 శాతం పశువులకు ఆడ దూడలు పుడతాయని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు సుధాకర్ తెలిపారు. మండల పరిధిలోని గుడ్డలపల్లి గ్రామంలో బుధవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేగ దూడల ఎదుగుదల, పునరుత్పత్తిలో లింగ నిర్ధారిత వీర్యం, ముర్రుపాల ప్రాముఖ్యత, ఖనిజ లవణ మిశ్రమం వాడకం, క్రమం తప్పకుండా నట్టల నివారణ మందుల వాడకం ముఖ్యమైనవి అని వివరించారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా క్యాల్షియం టానిక్కులు, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డి, గార్లదిన్నె పశువైద్యాధికారి రమేష్, గోపాలమిత్రలు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



పాడి రైతులకు నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

నేరాలు ఘోరాలు

షార్ట్ సర్క్యూట్‌తో రూ.4 లక్షలు నష్టం

ప్రజాశక్తి-గుత్తి



షార్ట్ సర్క్యూట్‌తో కాలి బూడిదైన వస్తువులు

పట్టణంలోని బీసీ కాలనీలో బుధవారం తెల్లవారుజామున ఓ ఇంటిలో షార్ట్ సర్క్యూట్ జరిగి పలు వస్తువులు కాలి బూడిదయ్యాయి. మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో ఇంటిలో ఉక్కపోత భరించలేక అనిత ప్రసన్న, రాజన్న దంపతులు పిల్లలతో కలిసి ఇంటిపై నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు రేగాయి. ఆ మంటల్లో విక్రయించేందుకు ఉంచిన చీరలు, నూతన దుస్తులు, గృహోపకరణలు కాలి బుడదయ్యాయి. పైకప్పుకు వేడి తగలడంతో గ్రహించిన వారు కిందికి దిగివచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే ఇంటిలో ఉన్న వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. దీంతో రూ.4 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, సీఐ ఎం.వెంకటరామిరెడ్డిలకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు.



అశేష భక్తజన సందోహం మధ్య బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా పెన్నోబిలేశుని రథోత్సవం

మార్మోగిన గోవింద నామస్మరణ

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహా స్వామి బ్రహ్మరథోత్సవం బుధవారం అశేష భక్తజన సందోహం మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఆలయం నలుదిక్కులా గోవింద నామ స్మరణ మార్మోగింది. రథోత్సవం సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అలాగే రథానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చి భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథాన్ని (మడుగు తేరు) లక్ష్మీదేవి ఆలయం వరకు లాగారు. సాయంత్రం వేలాది మంది భక్తజనం మధ్య బ్రహ్మ రథోత్సవం నిర్వహించగా భక్తులు పండ్లు సమర్పించి మొక్కు తీర్చుకొన్నారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవ వేడుకల్లో జిల్లా నుంచే కాకుండా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, ఇతర రాష్ట్రాల భక్తులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో విజయ్ కుమార్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రధాన అర్చకులు ద్వారకానాథ్ స్వామి, బాలాజీ స్వామి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు రామాలయం ప్రారంభోత్సవం

పుట్లూరు : మండల పరిధిలోని కొండగారికుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన పట్టాభి రామాల యం ప్రారంభోత్సవం, శ్రీచక్ర రాజముల విగ్రహ ప్రతిష్టాపన, తదితర కార్యక్రమాలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-నార్పల



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి మహమ్మద్ రఫీ, ఎంపిడిఓ దివాకర్, ఈఓఆర్‌డి లక్ష్మీనరసింహ

మండల పరిధిలోని చామలూరు, నిలువురాయి గ్రామాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను బుధవారం ఎంపీడీవో దివాకర్, ఈఓఆర్‌డి లక్ష్మీనరసింహతో కలిసి మండల ప్రత్యేకాధికారి మహమ్మద్ రఫీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పరిశీలించి, పురోగతి గురించి ఇంజినీరింగ్ సహాయకు లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందజేయాలని సూచించారు. సచివాలయానికి వెళ్లి సిబ్బంది పనితీరుపై సమీక్షించ చేయడంతో పాటు ఉద్యోగుల మూవ్ మెంట్ రిజిస్టర్, తదితర రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటిస్తూ, రోజుకు కనీసం 3 నుంచి 5 గంటల పాటు సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి గ్రీవెన్స్ నిర్వహించాలని సూచించారు. వారి వెంట మండల పంచాయతీ కార్యద ర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు ఉన్నారు.


వాలంటీర్లకు ఉన్న విలువ ప్రజాప్రతినిధులకు లేదు..

అధికార పార్టీ ఎంపిటిసిల ఆవేదన..

అధికారుల తీరుపై హనుమాపురం సర్పంచి ఆగ్రహం..

ప్రజాశక్తి-కణేకల్లు

గ్రామంలో వాలంటీర్లకు ఉన్న విలువ సర్పంచి, ఎంపిటిసిలకు లేదని అధికార పార్టీ ప్రజాప్రతినిధులే మండల సమావేశంలో పేర్కొనడం శోచనీయం. ప్రజల సమస్యలు పరిష్కరించలేని సమావేశాలు నిర్వహించడం ఎందుకని మండల పరిధిలోని ఎన్.హనుమాపు రం గ్రామ సర్పంచి జయరాం చౌదరి, ఎంపిటిసి నరేంద్ర అధికారులను ప్రశ్నించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సంధ్య అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం నిర్వహించగా సర్పంచితో పాటు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచి, ఎంపిటిసి మాట్లాడుతూ ఎన్.హనుమాపురం గ్రామంలో నెలకొన్న సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని, గ్రామానికి సంబంధిం చి ఎలాంటి సమావేశం నిర్వహించినా కనీస సమాచాచం ఇవ్వడం లేదని మండిపడ్డారు. గ్రామంలో రూ. 35 లక్షలతో ఉపాధి హామీ పనులు చేపట్టామని అధికారులు పేర్కొనగా ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేశాలో ప్రజలకు తెలపాలని ప్రశ్నించారు. ప్రతి సమావేశంలో గ్రామ సమస్యలు మొరపెట్టుకుంటున్నా అధికారులు స్పందించడం లేదని, ప్రజల సమస్యలు పరిష్కరించలేని సమావేశం నిర్వహించడం ఎందుకని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి వెళ్లిపోయారు. అనంతరం అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు కూడా వారు ప్రశ్నించిన వాటిలో నిజాలు ఉన్నాయని, అందుకే తాము పెదవి విప్పలేదని తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ రజాక్ వలి, ఈవోపీఆర్‌డి గుడేన, వైస్ ఎంపీపీ లీలావతి, మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు



మండల సమావేశంలో ప్రశ్నిస్తున్న సర్పంచి జయరాం చౌదరి